
కీర్తనలు

# లీలా మాధవము



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ అప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org | Mobile App: Free Gurukul | email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul | Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

## http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.

రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!



మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి.

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# శ్రీ లీలామాధవమ్

(కృష్ణావతార తత్త్వము)

(సంగీతగోష్ఠి రూపకము)


రచన :

డా॥ జి. ఎల్. ఎన్. శాస్త్రి, M.Sc., M Phil., Ph.D.

రీడర్ & భౌతికశాస్త్ర విభాగాధ్యక్షులు

టి.జె.పి.ఎస్, కళాశాల, గుంటూరు.



జగద్గురు పీఠము - గుంటూరు శాఖ

(THE WORLD TEACHER TRUST - GUNTUR BRANCH)

గుంటూరు - 522 002

# ముందు మాట

ఈ చిన్నపుస్తకములో 'శ్రీకృష్ణావతారతత్త్వము' 'సంగీత గోష్ఠీరూపకము'గా వివరింపబడినది. దీనిలో ప్రార్థన, స్తుతి, పాటలు భజన, కోలాటము, రాసక్రీడానృత్యగీతిక, భగవద్గీత మొదలైనవి భావ, రాగ, తాళయుక్తమైన, సంగీతపరముగాను; కృష్ణలీలయొక్క, కృష్ణతత్త్వముయొక్క ఆధ్యాత్మిక అంతరార్థములు పాత్రల 'సందేహ–సమాధాన' సంభాషణలద్వారాను వివరింపబడినవి. దీనిని పూర్తిగా ప్రదర్శించుటకు సుమారు ఒక గంటకాలము పట్టును. కాలము తక్కువ ఉన్నపుడు అవసరమైన మేరకు కొన్నిటిని తగ్గించి ప్రదర్శించవచ్చును.

ఈ 'లీలామాధవ గోష్ఠిరూపకము' మొట్టమొదటగా 1980 సంవత్సరములో విశాఖపట్నమునందు అస్మత్ గురువరేణ్యులు శ్రీమాన్ ఎక్కిరాల కృష్ణమాచార్యుల (మాస్టర్ ఇ.కె) వారి విశాల గృహప్రాంగణములో ప్రదర్శింపబడినది. నేను, నా శ్రీమతి చి. సౌ॥ విష్ణుప్రియ (మీనాక్షి), యస్. రఘురామ్‌కుమార్, మాష్టరు గారి కుమార్తె చి సౌ॥ లక్ష్మి, కోడలు చి.సౌ॥ తాయారు, తదితరులు పాత్రధారులుగా వ్యవహరించితిమి. నేను 'అక్కయ్యగారు' అని చనువుగా పిలిచే మాస్టరుగారి పత్నీమణి శ్రీమతి అప్పమ్మగారు ఆ ప్రదర్శనను చూసి ఆనందపడి వెంటనే నన్ను నూతనవస్త్రములతో సత్కరించిరి. వారి ఆనందమునకు కారణమైన ఈ చిన్న కృతిని "అక్కయ్యగారికే" అంకితము చేయుచున్నాను. ఆతరువాత ఇది ఆకాశవాణి, విశాఖపట్నకేంద్రము వారిచే సంగీతరూపకముగా కృష్ణాష్టమి పర్వదిన సందర్భమున ప్రసారము చేయబడినది.

ఈ రూపకము ఇలా పుస్తక రూపములో వెలుగులోనికి వచ్చుటకు కారకులు శ్రీ కొండా శివరామ కృష్ణమూర్తిగారు. వీరు గుంటూరు ప్రభుత్వఆసుపత్రిలో వైద్యేతర కార్యదర్శిగా ఈమధ్యనే

పదవీ విరమణ చేసిరి. వీరుగూడా మా మాస్టరు ఇ.కె గారి శిష్యులే! తనపై మాస్టరుగారి అనుగ్రహమును మరువని నిండు కృతజ్ఞతా భావము గలవారు. అందుచేతనే వారు పదవీ విరమణ చేయగానే లభించిన పి.ఎఫ్,గాట్యుటీ మొదలగువాటిద్వారా వచ్చిన సొమ్ములో కొంత శాతమును - వైద్యసేవకు కొంత, గురుపూజామహోత్సవము లకు కొంత, ఆధ్యాత్మిక గ్రంథముల ప్రచురణకు కొంత-కేటాయించి మా జగద్గురు పీఠము-గుంటూరుశాఖ చేయు సేవాకార్యక్రమములకు విరాళములను ఇచ్చిరి. మాస్టరుగారిపట్ల తన కృతజ్ఞతాభావమును గురుదక్షిణారూపములో తెల్పుకొనుటకు ఇది చక్కని అవకాశమని తృప్తిగా చెప్పి ఆనందముతో ఈ విరాళములనిచ్చిరి. ఉద్యోగ నిర్వహణా సమయములోగూడ ఆధ్యాత్మిక చింతనగల సహోద్యో గులను, మిత్రులను సమీకరించి "అమృతవాహిని" అనుపేర ఒక ఆధ్యాత్మిక మిత్రమండలిని స్థాపించి, ఆధ్యాత్మిక కథామంజరిగా "గాథాలహరి" అనుపేర ఒక పుస్తకమును ప్రచురింపజేసిరి.

ముందుముందు తన సహాయ సహకారములతో ఇంకా ఎన్నో సత్కార్యములు తనద్వారా జరగాలని, ఈ విషయములో మాస్టరు ఇ.కె గారికి సంబంధించిన సేవాకార్యక్రమములకు ఎప్పుడూ తాను సంసిద్ధముగా నున్నానని చెప్పిన వ్యక్తి.

తన గురువుకు, గురువుచూపిన మార్గమునకు తననుఅంకితము చేసుకొనిన శ్రీకె శివరామకృష్ణమూర్తిగారికి నాతరపున, మాజగద్గురు పీఠము - గుంటూరుశాఖతరపున కృతజ్ఞతాపూర్వక ధన్యవాదాలు తెలుపుతూ, వారికి, వారి కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యైశ్వర్యా లను భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను. తక్కువ వ్యవధిలో చక్కగా ముద్రించి ఈ పుస్తకాన్ని ఆవిష్కరణకు అందించిన శ్రీ లక్ష్మీగణపతి ముద్రణాలయము వారికి కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాను.

యువ విజయదశమి
3-10-95

—జి.ఎల్.ఎన్. శాస్త్రి

శ్రీ కృష్ణాయనమః

# "లీ లా మా ధ వ మ్"

ప్రార్థన : మూకం కరోతి వాచాలం -
పంగుం లంఘయతే గిరిమ్
యత్కృపా తమహం వందే -
పరమానంద మాధవమ్
వసుదేవ సుతం దేవం - కంస చాణూర మర్దనమ్
దేవకి పరమానందం - కృష్ణం వందే జగద్గురుమ్

స్తుతి :- జయ జయ జయ జయ శ్రీనివాస
జయ జయ జయ జయ శ్రితజనపోష ॥జయ॥
ధరణీతలమున ధర్మముచెడగా - ధర్మశీలురను
దయతో బ్రోవగ
అనువగువిధమున తనువునుబొంది - మరల ధర్మ
మును మహిని నిలుపుదువు ॥జయ॥
స్వర్గము నడిగిన సురపతికొరకు - యాచించిన మూడ
డుగల మేరకు
వటువుగఇంతై చివరకు అంతై - హరిపదమ్మును బలికి
నిచ్చితివి ॥జయ॥
పాలనలో లోపాలు పెరుగగా - బ్రహ్మశక్తితో
పరశురాముడై

క్రూరపాలకుల కుత్తుకలన్నీ - పరపర వరుసగ నరికి
తివయ్యా ॥జయ॥

ఉత్తమ మానవ గుణములతో - దాశరథిగ ఈ
ధరణిని బుట్టి

తండ్రిమాటపై అడవికి వెళ్ళి - రావణాది దుష్టులను
జంపితివి ॥జయ॥

దుష్టులునిండిన భూభారమును - తానిక మోయగ
జాలలేనని

భూసతి భక్తిని ప్రార్థించంగా-కృష్ణునిగా నీవవతరించి
తివి ॥జయ॥

**సుజాత** :- నాన్నగారూ! ఈయేడు మనింట్లో జరుపుకునే కృష్ణాష్టమి ఉత్సవానికి మా క్రొత్త ఫ్రెండ్సుగూడా వచ్చారు. అదిగో ఆ అమ్మాయి సరోజ, ఇతను రాము - మన ప్రక్కింట్లోనే వుంటున్నాడు; ఆ అబ్బాయి రాముా ఫ్రెండుట పేరు......

**రాము** (కల్పించుకొని) :- పేరు రంగారావు. సునిశిత విమర్శకుడు. ఏవో కొన్ని సందేహాలు మిమ్మల్నడగాలంటేను, నేనే తీసుకువచ్చాను.

**తండ్రి** :- అలాగా! అడుగునాయనా నాకు తెలిసినంతవరకు చెప్తాను. మళ్ళీ గుళ్ళోకిగూడా వెళ్ళిరావాలి.

రంగ :- ఏమండీ! గుళ్ళోకి వెడితేనే భక్తివున్నట్లా? ఇలా భజనలూ స్తోత్రాలూ చేస్తేనే భక్తులైనట్లా?

తండ్రి :- అయితే గుళ్ళోకి వెళ్ళకపోతేనే భక్తివున్నట్లా? భజనలు చేయకపోతేనే భక్తులైనట్లా?

రంగ :- (తత్తరపాటుతో) అని కాదనుకోండి. దేవుడు సర్వాంతర్యామి. అంతటా నిండివుంటాడుకదా! వేరే మళ్ళీ ఒక విగ్రహంచేసి దానికి మొక్కడం, భజనలు చేయడం దేనికీ అని.

తండ్రి :- నీప్రశ్నలోనే నీకు సమాధానం వుంది నాయనా! అంతా నిండి వుండే దేముడు విగ్రహంలో కూడా వుంటాడుకదా! మరి ఆ విగ్రహాన్ని పూజించడానికి అభ్యంతరం దేనికి? ఆవులోని పాలు గ్రహించటానికి దాని పొదుగు ఎలాంటిదో - విశ్వంలో నిండివున్న దేవుని అనుగ్రహానికి విగ్రహం అలాంటిదని అనుకోరాదూ!

రాము :- బాగా చెప్పారండీ బాబాయిగారూ! భూమిలో పంపుగొట్టాల్లో నీరు వున్నా - కుళాయినుండేగదా నీరు పట్టుకునేది! అంతేకదండీ!

తండ్రి :- అంతే రామూ అంతే!

రంగ :- అయితే ఈ దేవుణ్ణి విగ్రహంలో కొలవ్వాలసిం దేనా? దేవుడు మనలా ప్రాణమున్న వ్యక్తిలా వుండ లేడా?

తండ్రి :- "దేహో దేవాలయః ప్రోక్తః - జీవో దేవస్సనాతనః" అని వేదము చెపుతోంది. "ప్రతి జీవి శరీరము ఒక దేవాలయము. దానిలోవుండే ప్రతి జీవి దైవానికి ప్రతిరూపము" అని దీని అర్థం. దైవము ఒక్కో జీవిద్వారా వ్యక్తమవడం మనం గమనిస్తూనే ఉంటాము కూడా - "నిజంగా దేవుళ్ళా వచ్చి ఆదుకున్నాడు. లేకపోతే ఉద్యోగం ఊడేది." "డాక్టరుగారూ! మీరు నిజంగా దేవుడండి. మా బిడ్డను మాకు దక్కించారు" ఇలాంటి మాటలు మనం వింటూ వుంటాము. ఈ విధంగా అవసరాన్నిబట్టి ఒక్కో జీవిద్వారా వ్యక్తమవుతాడు దేవుడు.

రంగ :- అయితే ఆయనంతకు ఆయనకో శరీరం కల్పించుకోలేడా? అంతటివాడూ ఇలా ఇంకొకళ్ళమీద ఆధార పడాల్సిందేనా?

తండ్రి :- సత్యం, దయ, దానం ఇత్యాదివి దైవధర్మాలు. ఎవరిలో ఈ ధర్మాలు గుణాలుగా మారుతాయో వారిలోని ఆ సద్గుణాలు దైవమే! ఒక్కొక్కప్పుడు మరీ అవసరమనితోస్తే తన ధర్మాలన్నిటినీ గుణా

లుగా మార్చి గుణమయ శరీరంలో వ్యక్తమవుతాడు కూడా! గీతలో —

"యదా యదాహి ధర్మస్య గ్లాని ర్భవతి భారత
అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్
పరిత్రాణాయ సాధూనాం వినాశాయచదుష్కృతామ్
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే"

అని అవతారమూర్తిగా శ్రీకృష్ణుడు చెప్పాడు. "ఎప్పుడెప్పుడు ధర్మచ్యుతి జరిగి అధర్మం ప్రబలి పోతుందో అప్పుడప్పుడల్లా నన్ను నేను సృజించుకొని దుష్టశిక్షణ, శిష్టరక్షణచేసి - ధర్మాన్ని స్థాపించడం కోసం ప్రతి యుగంలోనూ దిగివస్తాను" అని దీని అర్థం.

రంగ :- ఏ దేశంలో ధర్మం చెడిపోయినప్పుడైనాగూడానా? లేక మన హిందూదేశంలోనేనా?

తండ్రి :- బావుందోయ్ నీ ప్రశ్న. 'మనదేశం' - 'పరాయి దేశం' ఇవి మానవుడు పెట్టుకొన్న పేర్లు. ఆయన ఈ సమస్త విశ్వానికి నాథుడు. అంతేకాదు. ప్రతి జీవి శరీరం ఒక భూమి అనుకుంటే- ఈ జీవియొక్క శరీరం అనే ఆ భూమి - 'దుర్భావాలు' అనే దుష్టులచే దురాక్రమణ చేయబడి దిగజారిపోయి ఉద్ధరణకోసం ప్రార్థిస్తే, తాను ఆ ప్రార్థనను ఆలకించి దిగి ఉద్ధరణ

గావిస్తాడు. ఆ దిగిరావడాన్నే అవతరణమంటారు. ఆ దిగివచ్చిన మూర్తినే అవతారమూర్తి అంటారు.

రంగ :- ఇప్పటికెన్నిసార్లలా దిగివచ్చాడంటారూ?

తండ్రి :- "మత్స్యః కూర్మోవరాహశ్చ నారసింహశ్చ వామనః

రామో రామశ్చ రామశ్చ కృష్ణః కల్కిరేవచ" ఈ శ్లోకం అవతారాల పేర్లను, వాటి వరుసను గూడా చెబుతుంది. మొత్తం పదిసార్లు దిగివస్తాడుట. ఇప్పటికి 9 సార్లు దిగివచ్చాడు. వరుసనుబట్టిచూస్తే శ్రీ కృష్ణావతారము తొమ్మిదవది. నిజానికి తొమ్మిదికన్న పూర్ణమైన అంకె మరొకటిలేదు. అలాగే శ్రీకృష్ణావతారంకన్నా పరిపూర్ణమైన అవతారం మరొకటి లేదు. ఈ అవతారంలో శరీరనిర్మాణం దగ్గర్నుంచి ఒక ప్రత్యేకత వుంది.

రఘు :- ఇందాక 'మన శరీరం అనే భూమికి దిగివస్తాడు' అన్నారు. దానిని కొంచెం వివరించగలరా?

తండ్రి :- మనలో ప్రేమ అనే పంట పండటానికి హృదయమనే పొలం వుంది. ఈ ప్రేమ అనే పంటకు దుర్భావాలు అనే కలుపుమొక్కలు అడ్డువస్తాయి వాటిని ఏరిపారేసి హృదయసీమను సస్యశ్యామలం చేయ

దానికి మన హృదయంలోకి సనాతన కృషీవలుడుగా దిగివస్తాడు.

జీవితం రణరంగం లాంటిది. దీనిలోనికి ప్రవేశించే నరుడు అనే రథికునియొక్క - శరీరమనే రథానికి జతచేయబడ్డ ఇంద్రియాలు అనే గుఱ్ఱాలను - మనస్సనే పగ్గంతో పట్టుకొని, సన్మార్గంలో పెట్టే ఆత్మోన్ముఖమైన బుద్ధి అనే సనాతనసారథిగా దిగివస్తాడు.

ఇంద్రియాలనే గోవుల్ని ప్రక్కదోవలుపట్టి పాడు దెబ్బలు తిననీయకుండా సంరక్షించే గోపాలుడుగా దిగివస్తాడు.

ధర్మచ్యుతి జరిగినపుడు జీవిలో అంకురించే దుర్భావాలైన ఈర్ష్య అనే దుర్యోధనుణ్ణి, మదమనే దుశ్శాసనుణ్ణి, దురహంకారమనే కర్ణుణ్ణి, మోసబుద్ధి అనే శకునిని - జ్ఞాన సంపర్కభావశక్తులనే పాండవులచేత నిర్మూలింపజేసి, అంతఃకరణమనే ధర్మరాజునకు ఆనంద పట్టాభిషేకం చేసే పరమాత్మగా దిగివస్తాడు.

రంగ :- భలే బాగా చెప్పారండీ. చక్కని సమన్వయం. చాలా బాగుంది.

తండ్రి :- మన ఇతిహాసాలు, పురాణాలూ అన్నీ అంతే నాయనా. ఒకప్రక్క బాహ్యకథా నడుస్తూ ఉం

టుంది, అంతర్లీనమై మనలో జరిగే కథా నడుస్తూ ఉంటుంది. అందుకే వాటిని ఆధ్యాత్మిక గ్రంథాలన్నారు. అవి 'ALLIGORIES' - అంటే అర్థవాదాల్లాంటివన్నమాట.

సరోజ :- ఇందాక కృష్ణుని శరీర నిర్మాణం దగ్గర్నుంచి ఒక ప్రత్యేకతవుందన్నారు. చాలామంది కృష్ణుడంటే పరవశులైపోతారని విన్నాను. చదివానుగూడా! ఇంతకీ ఆ రూపం అంత glamourous గా I mean ఆకర్షణీయంగా వుంటుందా?

తండ్రి :- ఎలా వుంటుందో లీలాశుకుడు ఒక శ్లోకంలో చెప్పాడు. మా సుజాతకు వచ్చు ఆ శ్లోకం. చదువమ్మా సుజా.

సుజా :- మధుర మధర బింబే మంజులం మందహాసే
శిశిర మమృతవాదే శీతలం దృష్టిపాతే
విపుల మరుణ నేత్రే విశ్రుతం వేణునాదే
మరకత మణినీలం బాల మాలోకయేను.

తండ్రి :- తీయనైన దొండపండులాంటి ఎర్రనైన క్రింది పెదవి, సొంపులొలికే సొగసైన చిరునవ్వు, చల్లనై అమృత మొలికే పలుకులు, చల్లని చూపులు, ఎర్రనైన వెడదకన్నులు, వీనులకు విందు చేకూర్చే

మురళీ రవళి, కలిగి ఇంద్రనీల మణివలె ఉండే ఆ రూపం ఎవరి మనస్సును హరించదు? అంతేకాదు అన్ని రకాలవారికి అన్నివిధాలా అందుబాటులో వున్నట్లే వుంటూ అందరికీ అంతుచిక్కని అపూర్వా వతారమూర్తి. చిలిపితనానికీ - చిన్నతనానికీ; అందానికి - ఆనందానికి; రాసక్రీడకు - రాజనీతికి, యోగానికి - భోగానికి, దానానికి - ధర్మానికి, రక్తికి - ముక్తికి ఈ శ్రీకృష్ణుణ్ణి అనుసరించి, ఆరాధించాల్సిందే!

రంగ :- ఈ కృష్ణుడు ఎప్పటివాడంటారు?

తండ్రి :- ఈ వైవస్వత మన్వంతరంలోనే 28 వ మహాయుగంలో, ద్వాపర యుగాంతంలోని శ్రీముఖ సంవత్సరములో శ్రావణ బహుళ అష్టమి రాత్రి వృషభ లగ్నంలో జన్మించాడు. వైకుంఠవాసుడైన శ్రీమన్నారాయణుడు కారాగారంలో దేవకీ వసుదేవులకు పుట్టినప్పటికి రేపల్లెలో యశోదానందుల వద్ద పెరిగి, గొల్లలతో తిరిగి పెద్దవాడయ్యాడు. అది రేపల్లె, రేపల్లెవాసులూ చేసుకున్న అదృష్టం — అంటూ నేను ఒక పాట వ్రాశాను. మా సుజాత వాళ్ళ స్కూల్లో పాటల పోటీలో పాడితే ఆ పాటకు ఫస్టు ప్రైజు వచ్చిందికూడా! అమ్మా సుజా ఆ పాట మనవాళ్ళకూడా వినిపించమ్మా

సుజా :- ఎంత పుణ్యము చేసెనో ఈపల్లె రేపల్లె
ఎన్ని నోములు నోచిరో ఈ గొల్ల వారెల్ల ॥ఎంత॥
పాల కడలిని తేలియాడే పరమపురుషుడే
పాలు పెరుగు. వెన్నకొఱకై పల్లెజేరుటయా?
శ్రీహరీ! పల్లెజేరుటయా! ॥ఎంత॥
పత్తికన్నా మెత్తనైనా పాము పానుపు వీడి
పల్లెవారి పంచజేరి పవ్వళించుటయా?
శ్రీహరీ! పవ్వళించుటయా! ॥ఎంత॥

సుధను గ్రోలి అమరులైన సురల చెలిమివీడి
వెఱ్ఱిగొల్లల వెంటపడగా అఱ్ఱుజాచుటయా?
శ్రీహరీ! అఱ్ఱుజాచుటయా! ॥ఎంత॥
అమరలోక వాసులిచ్చెడి అమృతభోజనమారగించక
గొల్లలిచ్చే చల్లతో హరి గొంతు తడుపుటయా?
శ్రీహరీ! గొంతు తడుపుటయా! ॥ఎంత॥

రాము :- నిజమే. అదృష్టంకాదూ! లేకపోతే ఎక్కడి వైకుంఠం! ఎక్కడ రేపల్లె!

సరోజ :- ఏమండీ కృష్ణుడు అల్లరివాడు, చిలిపివాడు అంటారుగదా! ఏం చేసేవాడేమిటి?

సుజాత :- కన్నయ్య అల్లరిపనుల గురించి మా అమ్మ బాగా చెబుతుంది. అమ్మా చెప్పమ్మా వీళ్ళు వింటారు.

తల్లి :- కృష్ణుడు చిలిపితనానికి పెట్టింది పేరు. అసలు ఏ అవతారంలోను ఇంత చిలిపితనం ప్రదర్శింపబడలేదు. కృష్ణుడు వెన్నకుండలో చెయ్యిపెడ్తుంటే - ఆ ఇంటి గోపికచూసి "ఎవరునువ్వు?" అంటుంది. "బలరాముని తమ్ముణ్ణి" అంటాడు కృష్ణుడు. "మరిక్కడి కెందుకు వచ్చినట్లు?" "మా ఇల్లనుకొని వచ్చాను" "అయితే ఆ చేస్తున్న పనేమిటి?" "ఆవు దూడ పోయింది. ఉందేమో వెతుకుతున్నాను" చూడండి ఎంత చిలిపి సమాధానాలో!

ఎంత చిలిపివాడో అంత చమత్కారిగూడా!

తల్లితో ఒకసారి "అమ్మా పాలగిన్నె ఇవ్వు" అంటాడు. "ఇప్పుడుకాదురా తండ్రి!" అంటుంది యశోద. "మరెప్పుడు?" 'రాత్రికి' "రాత్రంటే?" 'చీకటిపడుతుందే అప్పుడు' అనంగానే రెండు కళ్ళు మూసుకుని, "రాత్రి వచ్చింది పాలగిన్నె ఇవ్వు" అంటాడు. ఎంత చమత్కారో అంత గారడీవాడు గూడా!

కన్నయ్య మన్నుతిన్నాడని యశోదతో చెప్తారు తోటిపిల్లలు. "తినలేదమ్మా! వీళ్ళవన్నీ అబద్ధాలు"

అంటాడు. 'అయితే నోరు తెరు. ఎవరిది అబద్ధమో తెలుస్తుంది' అంటుంది. నోరు తెరుస్తాడు. "ఆ నోటిలో ఉన్నది వెండికొండా-వెన్నముద్దా? మహీ గోళమా - మట్టిపుద్దా? పాలకడలా-కడవపాలా?" యశోదను ఏమీ తేల్చుకోలేని స్థితిలో పడేస్తాడు గారడీకృష్ణుడు.

రంగ :- అయితే పిన్నిగారూ! కేవలం చిలిపితనమేనా? లేక పోతే బలిమితనం కూడా వుందా ఆ సుకుమార శరీరంలో?

శ్యాము :- ఆ బలపరాక్రమాల సంగతి గుఱించి నేన్నడుగు నేచెప్తాను. అది మన రీసెర్చి Topic.

కారాగారంలో పుట్టినప్పుడే తను రేపల్లెకు చేరడానికి గాను తన తండ్రి నెత్తిపైన బుట్టలోని పొత్తిళ్ళలో వుండే యమునానదిలో మార్గాన్ని ఏర్పాటు చేసుకున్న ఉపాయశాలి.

పాలిచ్చి చంపుదామని వచ్చిన పూతన దగ్గఱపాలు త్రాగుతున్నట్లే వుండి ప్రాణాలు పిప్పిచేసిన గడుగ్గాయి.

ఆమాయకంగా అందఱితో ఆడుతూ నేవుండి అయి దేళ్ళప్రాయంలోనే తృణావర్త, వత్సాసుర, వృషభా

సుర, బకాసురాదులను అమరలోకానికి పంపిన అసాధ్యుడు

దావపావక జ్వాలల్ని ద్రాక్షాపాకంలా త్రాగి - తల్లడిల్లే తనవారిని ఆదుకున్న అపరశివుడు.

ఇంద్రుడు తన అహంకారమదంతో గోగోపాలక బృందంమీద రాళ్ళవాన కురిపిస్తే ఏడేళ్ళ వయస్సులో తడారని తన చిటికెనవ్రేలితో గోవర్ధన పర్వతాన్ని పూగుత్తిలా ఎత్తి దానిక్రింద అందర్నీ ఆదుకున్న ఆపద్బాంధవుడు.

కోమలహస్తాలతో కువలయాపీడమనే హస్తియొక్క మస్తిష్కాన్ని చిత్తుచేసి రక్తసిక్త మౌక్తికాల్ని వసుధపై వెదజల్లిద పసగల పసిబాలుడు.

కొండలు తిరిగిన కర్కశకాయంగల, మహాద్రికఠోరుడు, మల్లయుద్ధ విశారదుడు అయిన చాణూర మత్తేభాన్ని చూర్ణంచేసిన గోపాలసింహం. స్వంత చెల్లెల్ని ఆమె భర్తను కారాగారబద్ధుల్ని చేసి, వారికి పుట్టిన పిల్లలందర్నీ చంపుతూ రాక్షసంగా ప్రవర్తించిన కంసుణ్ణి తను పన్నెండేళ్ళప్రాయంలో వున్నపుడే సింహాసనం నుండి క్రిందకులాగి పిడిగుద్దులతో పిండి పిండి చేసిన పిడుగు పిల్లవాడు.

సుజాత :- ఈ కృష్ణలీలలన్నిటినీ మేం స్కూల్లో కోలాటం ఆడాం కూడా!

తండ్రి :- అయితే అమ్మా అల్లా కోలాటమాడిన అందరూ ఇప్పుడిక్కడ వున్నారా?

సుజాత :- ఆహాఁ! ఒక్కరు తప్ప.

తండ్రి :- ఫర్వాలేదు. ఉన్నవాళ్ళే మరొక్కసారి మన కృష్ణుడి సాన్నిధ్యంలో పాడండి విందాం.

సుజాత బృందం :- రేపల్లెలోనా - గోపాలకృష్ణా
మాకెల్ల నీవే - మా ముద్దుకృష్ణా ॥రే॥

పాలు తాగి పాలకడలి చూపువాడా! మట్టితిని నోట
మహిని చూపువాడా!

వెన్నతిని వెండికొండ చూపువాడా! ఇంతనోట
విశ్వమంతా చూపువాడా!

మురళితోడ మురిపించెడివాడా! గిరిని ఎత్తిమము
బ్రోచినవాడా!

దుష్టకంసుని దునిమినవాడా! చాణూరమల్లుని
చంపినవాడా!

అఘాసురుని ప్రాణమడచినవాడా! శకటాసురుని
తన్ని చంపినవాడా!

గ్రుక్కతో పూతనగుండె పీల్చినవాడా! తృణావర్తుని
త్రుంచినవాడా!

నెత్తిపైన నెమలిపించమువాడా! చిత్తము నేదోచు
చిలిపి పిల్లాడా!

కాళీయదర్పము కాలరాచినవాడా! ఇంద్రబ్రహ్మలను
క్రిందు చేసినవాడా!

నల్లనివాడా-నవనీతచోరా! అల్లరివాడా-ఆకతాయి
వాడా

మా గొల్లవాడా - మా పిల్లవాడా! అందాలవాడా
అందానివాడా!

రంగ :- ఈ కృష్ణలీలలన్నీ కాదనుకోండి. కొన్ని మాత్రం కొంచెం ఎబ్బెట్టుగాను అశ్లీలంగాను ఉంటాయి. చిలిపితనం అన్నారు బాగానేవుంది. కాని కృష్ణుడి దొంగతనం మరీ తారస్థాయిలో వుంది. చచ్చి చెడి వెన్న దాచుకుంటే అదికాస్తా తినిపోవడమేమిటి?

తండ్రి :- ఈ వెన్న దొంగకు వెనక కథ చాలావుంది నాయనా!

జీవి అనే గోపికయొక్క శరీరం అనే పాత్రలో మనస్సు గుమ్మపాల వంటిది. అది పూర్తిగా జీవితానుభవాలు అనే వేడిలో మరగి-గురువాక్కు అనే

చల్ల చుక్కపడి, అహంకార మమకారాలనే కుదుపులు లేకుండా వున్నపుడు పెరగవుతుంది. అ పెరుగును వివేకం అనే కవ్వంతో చిలికినపుడు మంచి సంస్కార మనే వెన్న వేరౌతుంది. ఈ వెన్న తిరిగి మళ్ళీ మజ్జిగలో కలవదు. అంటే వివేకసంస్కారం కలిగిన నాటినుండీ పంపకంలో పుట్టి పెరిగినా పంకం అంటని, అంటించుకోనని పద్మపత్రంలాగా - జీవి సంసారం అంటకుండా సంసారంలో తేలుతూవుంటాడు. నల్ల వానికి యిష్టమైంది ఈ సంస్కారమనే వెన్న అన్న మాట!

రాము :- కాళీయ మర్దనానికిగూడా నేనిలాంటి అంతరార్థమే విన్నానంటోయ్!

రంగ :- ఏమిటది చెప్పు.

రాము :- సంసారమనే మడుగులో - అహంకారమనే విషం చిందిస్తూ, మమకారమనే కాళీయుని దర్పమనే మదాన్ని పసివాడని తన పాదారవిందంతో పాతాళానికి అణగద్రొక్కుతూ జీవికి ఆనందస్పర్శను అందించే లీల అన్నమాట!

సరోజ :- ఎంత చిలిపివాడైనా ఆడవాళ్లు స్నానంచేస్తూంటే బట్టలెత్తుకుపోవడం, పోనీగదా అని ఇమ్మని అడిగితే

రెండు చేతులూ ఎత్తి నమస్కరించి నన్ను అర్థించండి అనడం ఇవన్నీ విలన్ లక్షణాల్లా వున్నాయి తప్పితే హీరోవిగా లేవు.

తండ్రి :- ఆవేశపడకమ్మా సరోజా! ఈ ఆధ్యాత్మిక గ్రంథాల్ని జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి వాటి అసలు ధ్యేయం వేరు. కొందరు కథా సన్నివేశాలకు ఆకర్షితులై చదివేవారుంటారు. కొందరు వాటిలో అసలు అర్థాన్ని తెలుసుకుంటారు ఇలా ఇద్దరూ ఆకర్షితులు అవడం కోసం వ్రాసినవి. చిన్నప్పుడు ఎక్కాలు 9×9=81 అని చదివి బట్టీపడతాం. అలా ఎందుకు, ఎలా అయిందో మనం పట్టించుకోం. కాని పెద్ద క్లాసులకి వెళ్ళే కొద్దీ ఈ సంఖ్యల అసలు సంగతి తెలుస్తుంది. అల్లా అన్నమాట! ముందు కథ తెలిస్తే ఆ తర్వాత అంతరార్థం. ఇప్పుడు విను దీనిలోని అంతరార్థం.

కృష్ణుడు పరమాత్మ, గోపిక జీవాత్మ. ఈ దేహం మూలాన్నే జీవాత్మ పరమాత్మకు వేరుగా గుర్తింపబడుతుంది. ఒక్కసారి ఈ దేహభ్రాంతి తొలగితే జీవాత్మకు తను పరమాత్మలోని అంశమే అని ఆత్మదర్శనం జరుగుతుంది. వస్త్రం శరీరాన్ని కప్పినట్లు దేహం జీవాత్మని కప్పుతుంది. దేహమనే వస్త్రాన్ని

మాయంచేసి గోపికాజీవులకు ఆత్మదర్శనం కలుగ జేయడమే గోపికావస్త్రాపహరణలీల! మన ఒక చేతి 5 వేళ్ళు పాంచభౌతిక బ్రహ్మాండానికి, రెండో చేతి 5 వేళ్ళు పాంచభౌతిక పిండాండానికి గుర్తులు. చేతులు కలుపగా ఏర్పడే నమస్కారం ఈ బ్రహ్మాండ పిం డాండ సమన్వయానికి లేదా అనుసంధానానికి గుర్తన్నమాట! ఆత్మదర్శనం కలగడం కోసమే రెండు చేతులు ఎత్తి కలిపి నమస్కరించమనడం. పైగా అప్పటికి కృష్ణుడికెన్నేళ్ళో తెలుసా? 7 ఏళ్ళు. ఆ వయస్సులో కృష్ణుని ఆ చర్యను గూర్చి మనం ఏవేవో వూహించడం మన వెఱ్ఱితనంగాదా!

రాము :- అమ్మమ్మా! ఎంత నిగూఢమైన రచనండీ. Really splendid. బాబాయిగారూ! రాసక్రీడగ్గూడా చెప్తారా? నా thesis లో అది గూడా touch చెయ్యదలచుకొన్నాను.

తండ్రి :- తప్పకుండా. "ప్రతి జీవి అనే గోపికయొక్క హృదయమనే బృందావనంలో శ్వాసలోని 'సోఽహం' అనే వంశీనాదాన్ని చేస్తూ, దానిలో 'నేను' అనే తనని గుర్తించమంటాడు మురళీధరుడు. నాటినుండి నేటివరకూ ఈ 'నేను' అనే కృష్ణుణ్ణి అన్వేషిస్తున్నారు జీవులనే గోపికలు. ఈ అన్వేషణలో

ఒక్కొక్కప్పుడు ఈ గోపికలు ఓపికలు లేని వారౌ తారు కూడా! ఈ ఓపికలేనితనమే ఆర్తిని కలిగిస్తుంది. అది కలిగినపుడే దూరము దగ్గఱ నశించి వాస్తవమైన భక్తి అనే సాన్నిధ్యం లభిస్తుంది. ఎదుటజీవి అనే గోపికలో కూడా ఆ "నేను" అనే కృష్ణుణ్ణే చూడ గలిగినపుడు వారి అన్వేషణాఫలము పరాకాష్ఠనందు కుంటుంది. అట్టి స్థితిలో పొందే ఆనందానుభూతిని వర్ణించే లీలే రాసక్రీడ. నిజానికక్కడ కృష్ణుడు ప్రత్యేకంగా ఏ ఒక్క గోపికతోనూ ఆడడు. ప్రతి గోపికకు ఎదుటిగోపిక కృష్ణునిలా కన్పించి ఆనందాను భూతి పొందింది. అంతే!

తల్లి :- ఏమండోయ్ అన్నట్లు ఈసారి కృష్ణాష్టమి సంద ర్భంగా ఈ రాసక్రీడను వీనులవిందుగాపాడి, కన్నుల పండువుగా ఆడి చూపిస్తామన్నారు. మన ఇరుగు పొరుగు సుజాత తోటిపిల్లలు. వాళ్ళందరూ రెడీగా వున్నారు. మీరు కాస్సేపు మీ చర్చలాపి, అటువైపు తిరగండి వాళ్ళు మొదలెట్టబోతున్నారు.

నను జేరరా దివ్యచరణా
మురళీధరా కమలనయనా ॥నను॥

గోపిక : 1

మృదుల మనోహరనాదముతో మధుర సుధామయ
గానముతో
సుందర బంధుర దరహాసముతో ॥నను॥

గోపిక : 2

నుదుట మృగమద తిలకముతో ఎదపయి కౌస్తుభ
మణి కాంతులతో
నాసికాంతమున నవమౌక్తికముతో ॥నను॥

గోపిక : 3

శిరమునందున శిఖిపింఛముతో కరమున కంకణ
కాంతులతో
మెడపై జారెడు తులసిమాలతో ॥నను॥

గోపిక : 4

కనుల కొలకుల కారుణ్యముతో మనసున మెదిలే
అనురాగముతో
డెందము నిండే ఆనందముతో ॥నను॥

కృష్ణుడు : కుసుమ కోమల గోపికా రమణులార
పరమ రమణీయ శృంగార లహరులార
వంతులేమియు వలదమ్మ ఇంతులార
కాంతలెందరు గానిండు చింతలేదు

ఒకరి కొకొక్కరూపుగా నిలచినేను
అందరికిని పంచుదానంద మిలను
ఎచటి కేగెనమ్మా! కన్నయ్యెచటి కేగెనమ్మా ॥ఎచటి॥

గోపిక : 1 కరకమలములతో నతిమృదులమ్ముగ
కనులు మూసెనే ఓ చెలియా
నా కనులు మూసెనే ఓ చెలియా ॥ఎచటి॥

2. నవ్వుల కుప్పను పట్టితిరుగుచు తిప్పలు పెట్టెనె ఓ సఖియా
నను తిప్పలు పెట్టెనె ఓ సఖియా ॥ఎచటి॥

3. వీనుల విందుగ వేణువు నూదుచు మైమరపించెనె ఓ చెలియా
నను మైమరపించెనె ఓ చెలియా ॥ఎచటి॥

4. ఆదమరచి నేనదపై వ్రాలితె బుగ్గలు నిమిరెనె ఓ చెలియా
నా బుగ్గలు నిమిరెనె ఓ సఖియా ॥ఎచటి॥

తండ్రి :- పిల్లలైనా బాగా ఒప్పించారే. పాటలు కూడా చాలా బాగా పాడారు.

రాణి :- ఇప్పటి కాలం పిల్లలకు మనం చెప్పకపోవడం లోపం గాని, ఏదైనా సరే. రాకపోవడం అంటూ వుండదు.

సరేగానీండి కృష్ణుణ్ణి 'అవాఙ్మానస గోచరుడంటారు.' అంటే ఏమిటండీ!

తండ్రి :- మన వాక్కులకూ మనస్సుకూ అందేవాడు కాదు అని అర్థం. ఒకటి రెండు సన్నివేశాలు చెబుతేగాని నీకర్థం కాదు.

రాయబారానికి వెళ్ళినప్పుడు దుర్యోధనుడు కృష్ణుణ్ణి విందు కాహ్వానిస్తాడు. అందుకు కృష్ణుడు "చూడు బావా! నేను రాయబారిగా వచ్చాను. మరి అట్లాంటప్పుడు నేను మీ విందు స్వీకరించానే అనుకో - పొరపాటున ఈ పాడు భౌతిక శరీరానికి జ్వరంలాంటిది ఏదైనా దాపురిస్తే- నిజానికది దానంతటదిరావాల్సి వచ్చినా గూడా వెంటనే జనం మీవిందుకు- నా అనారోగ్యానికీ ముడిపెడతారు. పుణ్యానికిపోతేపాపం ఎదురైనట్లు మీకు లేనిపోని అపవాదు వస్తుంది. మీకలాటి అపవాదురావడం-అందులోను నా మూలంగా రావడం నాకిష్టంలేదు. ఎందుకొచ్చింది నా ఏర్పాటు నేను చూసుకుంటానుగానీ బావా నువ్వా విషయం మరిచిపోయ్!" అంటాడు. చూశారా? - ఎంత లౌక్యంగా తప్పుకున్నాడో! ఎంత మెత్తగా నోరు మూయించాడో!! నిజానికది విషపూరితమైన విందే కూడా!

రాము :- అవునండోయ్! మన మాటలకందడంటే గుర్తొచ్చింది. ఈ విషయంలో దుర్యోధనుడైనా అర్జునుడైనా కృష్ణుడికి ఒక్కటే! రాయబారానికి పోయే ముందు పాండవుల అభిప్రాయాలు అడుగుతాడు కృష్ణుడు. అందరూ తలొకటి చెప్తారు. అర్జునుడు మహాలౌక్యంగా "బావా ఏ పని సాధించడానికైనా పురుషప్రయత్నం, దైవసహాయం రెండూ కుదరాలి. నువ్వు మాకు బావవు, దైవానివికూడా! అంటే ఈ పనికి ఇటు పురుషప్రయత్నమూ అటు దైవ ప్రయత్నమూగూడా నువ్వేమాకు. ఇలా కలిసిరావడం మా అదృష్టం. కాబట్టి మాకు కలిసి వచ్చే విధంగా నువ్వే చూడాలి మరి" అంటాడు. అప్పుడు కృష్ణుడు "అర్జునా! పురుషప్రయత్నంగా నేను రాయబారానికి వెళ్ళి మీరు చెప్పమన్న విధంగా చెప్తాను. ఇక దైవప్రయత్నం మాటవస్తే ప్రస్తుతం నీకెంత తెలుసో నాకూ అంతే. అప్పుడెలా జరగాలో అలా ఆ సమయాన్నిబట్టి జరగటమే దైవప్రయత్నమౌతుంది" అంటాడు. అర్జునుడు మళ్ళీ నోరెత్తలేదు.

రంగ :- మరి ఇలాంటివాడు భక్తులగోడుకూడా వినకుండా లౌక్యంగా తప్పించుకోడా?

తల్లి :- అదేమిటినాయనా అలా అంటావు. ద్రౌపదిని నిండుకొలువులో వలువలు వొలిచి అవమానిస్తుంటే తనక్కడ లేనప్పటికీ గ్రహించగల్గి, అక్షయవస్త్రాలిచ్చి ఆదుకోలేదూ? కులసతికి అంతకంటె కావల్సిందేముంటుంది చెప్పు. అంతెందుకు? కృష్ణుడికి భక్తులంటే ఎంత అభిమానమో చెబుతా విను. రాయబారిగా వెళ్ళిన కృష్ణుడు భోజనానికి విదురునింటికి వెళ్ళి "అత్తా! తలుపుతియ్యి, నేను వచ్చాను." అంటూ తలుపు తడతాడు. కంఠం గుర్తుపట్టి కృష్ణుడు వచ్చాడన్న ఆనందంతో పరవశించి విదురుని భార్య స్నానం చేస్తూన్నదల్లా అల్లా నేవచ్చి తలుపుతీస్తుంది. కృష్ణుడు వెంటనే తన ఉత్తరీయాన్ని ఆమె పైకి విసురుతాడు. ఆకలి వేస్తోందంటే కృష్ణునికి అరటిపళ్ళ తొక్కలుతీసి అందిస్తూ తన్మయత్వంతో కృష్ణుణ్ణే చూస్తూ వుంటుంది. అప్పుడే వచ్చిన విదురుడు తన భార్య పళ్ళన్నీ వాకిట్లోకి విసిర్తి, తొక్కల్ని పెట్టాండడం, కృష్ణుడు కూడా ఆమెను వారించకుండా ఆ తొక్కల్నే తింటూ వుండటంచూసి ఆశ్చర్యపోతాడు. పరమభాగవతోత్తముడుగాబట్టి విషయాన్ని అర్థం చేసుకుంటాడు. భక్తులంటే కృష్ణునకంత ప్రేమ!

తండ్రి :- పైగా, ఆ ప్రేమలో వర్ణభేదం, ఆడామొగా తేడాలూ కూడా వుండవు. చిన్ననాటి స్నేహితుడు,

గర్భదరిద్రుడు అయిన కుచేలుడు తను తెచ్చిన అటుకులు కృష్ణునకివ్వడానికి బిడియపడుతూ వుంటే-అతని కొంగున వున్న వాటిని తనంతకు తానే విప్పుకొని తిని, అనంతైశ్వర్యాలను ప్రసాదిస్తాడు. అంతే గాని అతను తెచ్చింది అటుకులేకదా! తెచ్చినా తనంతకు తానివ్వలేదుగదా అని లౌక్యం ప్రదర్శించ లేదు. ఆ లౌక్యంలేదు గనకే ఆదర్శప్రాయుడైనాడు. తను సంపూర్ణప్రజ్ఞావంతుడే! నిజానికి కృష్ణునికి ఇంకొకరి దగ్గఱ నేర్వవలసినదేముంది? అయినప్పటికీ లోకానికాదర్శప్రాయంగా వుండాలని ఒక గురువు వద్ద శిష్యుడిగా సాందీపనివద్ద విద్యాభ్యాసం చేశాడు. "తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా" అని గీతలో తానేగదా చెప్పినది. అలా చెప్పినదానికి చేసినదానికీ తేడాలేనివాడు.

రాము :- నిజమేనంటోయ్! ఒక్క భక్తుల విషయంలోనూ, గురువు విషయంలోనే ఏమిటీ! కృష్ణునికి వేదవిదులన్నా ఎంత గౌరవమని? రాజసూయయాగంలో కానుకలు స్వీకరించడానికి దుర్యోధనుణ్ణి, పాకశాల అజమాయిషీకి దుశ్శాసనుణ్ణి, సంభావనాదుల కార్యక్రమానికి కృపాచార్యుణ్ణి, ధృతరాష్ట్రాది పెద్దల సేవకు నకులుణ్ణి - ఇలా అందరికీ అన్నీ అప్పగించి,

వచ్చిన ఋషుల కాళ్ళు కడిగే కార్యక్రమానికి తననే నియోగించుకున్నాడు కదా! జగత్తు దైవాధీనం అనీ, ఆ దైవం మంత్రాధీనం అనీ, ఆ మంత్రం వేదవిదుల అధీనమనీ కృష్ణుని అభిమతం. అందుకే వేదపండితునికి అంత గౌరవాన్నిచ్చి, రాబోయేవారికి ఆదర్శంగా నిలిచాడు వేణుగోపాలుడు.

సుజాత :- అమ్మా! వేణువంటే గుర్తొచ్చింది, నాన్న వ్రాశారే వేణునాదం మీద పాట, ఆ పాట పాడవే బాగుంటుంది.

తల్లి :- బృందావన విధు మాధవమురళీ
మంజుల సుమధురనాదం
చందన పరిమళ మిళిత సుధాకర
కిరణ సముద్భవ మోదం ॥బృందా॥

సూనవితాన విముక్త సువాసిత
వేణు వినిశ్రుత నాదం
సుందర స్నిగ్ధ ప్రమోద తరం
మధురాధర ప్రభవితనాదం ॥బృందా॥

కమలకరాంకిత సుందరమురళీ
మృదుల మనోహర నాదం
విమల వికాస విలాస విలోచన
గోపవధూజన మోదం ॥బృందా॥

రంగ :- మురళీ రవళి నిజంగా అలాంటిదే. మనస్సును మూరి పిస్తుంది. అవునూ ఈ వేణువుగ్గూడా ఏదన్నా Symbolism వుంటే చెప్పండి.

తండ్రి :- మనందరిలోనూ వెన్నముక వెంబడే మూలా ధారాది షట్చక్రాలుంటాయి. అవిపరుసగా మనలోని పృథివ్యాపస్తేజో వాయురాకాశ మన స్తత్త్వాలను నియమబద్ధంచేసే Steering లాంటిచక్రాలు. యోగ సాధనలో కుండలినీశక్తి ఉద్బుద్ధమై ఉద్గమనంచేస్తూ ఈషట్చక్రాలను స్పృశించుకుంటూపోయిమనప్రజ్ఞకు అతీతంగా వుండే సహస్రారపద్మంలో శివునితో కలిసి యోగసిద్ధిని చేకూరుస్తుంది. యోగసాధనకు వెన్నెముక వెంబడివున్న ఈ షట్చక్రాలు, సహ స్రారం కలిసి ఎలాగో రాగసాధనలో వేణువు అలా గన్నమాట. దీనికి మొత్తం ఏడు రంధ్రాలుంటాయి. దీని ద్వారా సిద్ధించే నాదోపాసనద్వారా కూడా యోగస్థితిని పొందవచ్చు. సంగీతానికి స్వరాలుకూడా ఏడేకదా! ఈ సంగీతానికి పాండిత్యంతో సంబంధం లేదు. పండితులకు, పామరులకు-శిశువులకు, పశువు లకు, పక్షులకు, సర్పాలకు అందరికీ ఆనందానుభూతిని కలుగజేస్తుంది.

రాము :- అంతే కాదండోయ్. నేనీ మధ్య ఒక రీసెర్చి జర్నల్‌లో చదివాను. సంగీతంతో పొలాలలో ఫల సాయం పెరిగిందని, పశువుల్లో క్షీరవృద్ధి జరిగిందని, మనుష్యులకు మందుల్తో తగ్గని రోగాలు కొన్ని నయమయాయని అమెరికా పరిశోధకులు అంటున్నారు. ఇంత ఉపయోగం ఉండబట్టే వేణువు గోపాలుడికి ఒక భాగమై పోయిందనుకుంటాను.

రంగ :- వేణునాదం విశ్వామోదం. బాగానేవుంది. మరి కృష్ణునికి గోవులంటే అంత యిష్టం దేనికండీ? పైగా పరంపరాగతంగా వస్తున్న ఇంద్రపూజనాపి గోవర్ధన పూజగూడా చేయించాడే?

తండ్రి :- మనం విలువలేనిదాన్ని గడ్డితోపోలుస్తాం. మరి ఆ గడ్డిని కాస్తపడేస్తే-పొద్దున్నలేస్తే మనింట్లో పసివాళ్ళ దగ్గఱ్నుండీ ముసలివాళ్ళదాకా కావల్సిన పాలు, పెరుగు, వెన్న, నెయ్యి ఇస్తాయి ఆవులు; ఎద్దులు పొలం దున్నుతాయి, బండిలాగుతాయి; వాటి పేడగూడా పొలానికి మంచి ఎరువు; తన బిడ్డకు చెందవలసిన పాలను కొల్లగొట్టి నరుడు పశువుల దగ్గఱ తీసికొనివాడుకుంటున్నాడు. అదే ఒక నరజాతి స్త్రీని "నీకు గడ్డి లేదా అన్నమే పెడతాను నీ బిడ్డకివ్వవలసిన పాలు మాకిస్తావా?" అని అడిగితే.....

రంగ :- పళ్ళురాలగొడ్తుంది.

తండ్రి :- అవునా! మరి దీన్నిబట్టి నరుడు నోరులేని పశువుల విషయంలో ఎంత అవకాశం తీసుకుంటున్నాడో, స్వార్థం చెలాయిస్తున్నాడో తెలీటంలేదూ! మరి అట్లాంటి అవకాశం తీసికొన్న నరుడు జంతువుల పట్ల ఎంత విశ్వాసంగా ప్రవర్తించాలి? అన్న విషయం మానవత్వానికి సంబంధించింది అందుకే కృష్ణుడు గోకులవాసులచేత ఇంద్రపూజకుస్వస్తి చెప్పి గోవర్ధన పూజ చేయించాడు.

రాము :- నిజంగా కళ్ళకు పట్టిన పొరలు విడిపోతున్నాయండీ మీరు చెప్పే విషయాలు వింటూంటే.

తండ్రి :- ఒక్కసారి మరి ఆ గోపాలుణ్ణి మనసారా భజిద్దామా? అమ్మా సుజా ప్రారంభించు -

సుజాత :- (కంఠం సవరించుకుంటూ శ్రుతి చేసి)

గిరిధర గోపాలా మాంపాహి గిరిధర గోపాలా ॥గిరి॥

నందకిశోరా-నవనీతచోరా! సుందర బృందా విహారా
శ్రుతిపదసారా-ధృతి గుణహీరా! శ్రితజన మందరా ॥గిరి॥

భవభయహరణా-శుభఫలచరణా! సరసిజ దళనయనా

నిరుపమకరుణా-నిర్మలచరణా! మందస్మిత వదనా
||గిరి||

రంగ:-అంతా బాగానేవుందిగాని, ఎంత సమాధానపడాలన్నా కుదరని విషయం ఒకటున్నదండీ. "భూమిలో రథ చక్రం దిగబడింది ఇప్పుడు నాపై బాణం ప్రయోగించడం ధర్మంకాదు కృష్ణా! అని కర్ణుడు అన్న మాట లెక్క-చెయ్యకుండా అర్జునుడిచేత అదే సమయంలో కొట్టించాడు. ఇది అన్యాయంకాదా?

తండ్రి :- కర్ణుడిలా అనగానే కృష్ణుడేమన్నాడో తెలుసా? "కర్ణా! నీకూ ధర్మానర్మాలు తెలుసునన్నమాట! భేష్! మరి ఆ కౌరవ నిండుసభలో ద్రౌపదిని వివస్త్రగా కూడా చెయ్యొచ్చు అని నువ్వు చెప్పింది కూడా ధర్మం క్రిందకే వస్తుంది కాబోలు! ఏమీ తెలియని అమాయకుడైన, పసివాడైన అభిమన్యుణ్ణి ఒక్కణ్ణిచేసి తాకుసంగా పోతుల్లాంటి పెద్దలందరూ ఎగబడి గుమిగూడి అతిహీనంగా చంపటంకూడా ధర్మం క్రిందకే వస్తుంది కాబోలు! మరి ఆనాడు నీకు ఈ ధర్మాధర్మాలు ఎందుకు గుర్తుకువస్తాయి? ఈనాడు నీ స్వంత వ్యవహారం-తత్రాణ ప్రాణాల్లోపని, ధర్మం గుర్తుకు వచ్చిందంటే రాదూ మరి! అయినా అన్ని సమయాల్లోనూ ధర్మానికి కట్టుబడేవాళ్ళకి

ధర్మంగాని మీలాంటివారికెందుకు? కొట్టు అర్జునా. ఏదన్నా పాపం అంటుకుంటే అదినాది. నీకేం సంబంధంలేదు. కొట్టునువ్వు" అని అన్నాడు. అదీ కృష్ణుని ధర్మనిర్ణయం. అయినా కృష్ణుడికి కావల్సింది పాండవులు గెల్చారా? కౌరవులు గెల్చారా? దుర్యోధనుడు పోయాడా? కర్ణుడు పోయాడా? అభిమన్యుడు పోయాడా? అన్న విషయం కానేకాదు. 'ధర్మం జయించిందా, అధర్మం జయించిందా? యుద్ధంవల్ల భూభారమేమన్నా తగ్గిందా-లేదా?' అన్నదే కృష్ణుడికి కావల్సింది. అంతకుమించి తాను ఏమీ పట్టించుకోలేదు, అంటించుకోలేదు. కంస వధానంతరం ఉగ్రసేనుడికి రాజ్యం పట్టం కట్టాడు. జరాసంధుణ్ణి చంపించి అతని కొడుకునే రాజ్యాభిషిక్తుని చేశాడు. ఒకసారి ఉగ్రసేనుడు రాజ్యం ఏలుకొమ్మని కృష్ణుని బ్రతిమలాడినా

"నహి రాజ్యేన మే కార్యం నా ప్యహం నృప కాంక్షితం
న చాపి రాజ్య లుబ్ధేన మయా కంసో నిపాతితః"

అన్నాడు. 30 ఏళ్ళ వయసులోనే రాజ్యంమీద అంతటి వైరాగ్యం కృష్ణుడికి.

తల్లి :- కృష్ణుడెంతటి సంస్కార హృదయం కలవాడో

చాలామంది గుర్తించరు ఎందుకనో ! నరకాసురుని సంహారించి అతడిచేత చెరపెట్టబడ్డ రాజులను, 16,000 రాజకన్యలను విడుదలచేస్తాడు. 'చెరలోనే యుక్తవయస్సంతా గడిచిపోయింది. ఇంక మమ్మెల్వరు పెళ్ళి చేసుకుంటారు? నీవే మాకు భర్తగా ఉండాలని అర్థిస్తున్నాము.' అంటే ఆ 16వేలమందిని పెళ్ళిచేసికుని సమాజంలో వారికి గౌరవప్రపత్తిని ప్రసాదించిన సంస్కారి. ఈ 16 వేలమందీ- రాజకుమార్తెలుగాని, గోపికలుకాదు. ఈ సంగతి చాలామందికి తెలియదు.

రంగ :- మరి యింతమందిని పెళ్ళిచేసుకున్న కృష్ణుణ్ణి అస్ఖలిత బ్రహ్మచారి అంటారు అదేమిటండీ? చిత్రంగా లేదూ!

తండ్రి :- కృష్ణుడు నిర్వికార నిష్కళంకుడు. పంపకంలో పుట్టి, పంపకంలో పెరిగినా పంపకం అంటని పద్మం లాంటివాడు. అంతమంది భార్యలకు తాను ఆకర్షితుడైనాడుగాని, తనకు వాళ్ళల్లో ఏ ఒక్కరూ ఆకర్షితులు కాలేదన్న విషయం గుర్తుంచుకోవాలి. రుక్మిణి పిల్లలు కావాలని పట్టుబడుతుంది. అందులకై కృష్ణుడు కైలాసపర్వతంమీద శివునిగూర్చి తపస్సు చేస్తాడు. శివుని వరప్రసాదంవల్ల పుట్టిన వారే ప్రద్యుమ్నాది

పుత్రులు. మరి దీన్నిబట్టిచూస్తే ఆయన దాంపత్యం గాని, రాసక్రీడగాని, ఎంతవరకూ భౌతికమో తెలుస్తుంది. ఆయన ఇంతమంది భార్యలకూ ప్రసాదించింది ఆయన సాన్నిధ్యమాధుర్యాన్ని మాత్రమేనని గుర్తుంచుకోవాలి. అందుకే కృష్ణుడు స్ఖలిత వీర్యుడు కాడు. అశ్వత్థామ అస్త్రప్రయోగానికి ఆహుతి అయే ఉత్తరగర్భాన్ని ఇలాంటి అస్ఖలిత బ్రహ్మచారి కనుకనే ఆదుకోగలిగాడు. బ్రహ్మచారి అని మనం చెప్పుకునే భీష్ముడుగూడా ఈ సందర్భంలో పనికి రాలేదు.

సరోజ :- బాబాయిగారూ! ఎన్నో పెద్ద పెద్ద గ్రంథాలు మనకుండగా మనవారికి అన్నిటికంటె ఈ భగవద్గీత ఎందుకు ప్రామాణికమైంది? రామాయణ, భారత, భాగవతాలున్నా కోర్టుల్లో కూడా ఈ చిన్న భగవద్గీతమీాదనే ప్రమాణం చేయిస్తారెందుకని?

తండ్రి :- మోహావేశంలో తాత్కాలికంగా స్మృతిని పోగొట్టుకుని కర్తవ్యం తేల్చుకోలేక దిగాలుపడే నరుడికి నారాయణుడు వెన్నుతట్టి ఉపదేశించిందే గీత, అన్నితరాల వారికీ, అన్ని స్థాయిలలోని వారికీ సరిపోయేటట్లుగా; సరిపడేట్లుగా ఇచ్చిన సందేశం ఈ

గీతా ప్రబోధం. బ్రహ్మవిద్యకు సంబంధించినంత వరకూ ఈ గీతలోలేని విషయం ఏ గ్రంథంలోనూ లేదు. ఈ గీత మొత్తం బ్రహ్మవిద్య అనే భవనానికి దూరంగావుండి తీసిన 3-D ఫొటోలాంటిది. అందుకే ప్రతి విషయము ఈ గీతలో బీజరూపంలో వుంటుంది. సరిగా విడమరచి విపులీకరించి అర్థం చెప్పుకుంటే ఈ గీత ఒక్కటిచాలు మన రాత మార్చడానికీ, మన చేత మార్చడానికి.

తల్లి :- ఏమండీ మనమ్మాయి సుజాతని, వాళ్ళ స్నేహితురాలు పద్మని మీరు వ్రాసిన గీతోపదేశాన్ని ఇప్పుడు వినిపించమనకూడదూ?

తండ్రి :- 'అమ్మా సుజా మరెందుకింక ఆలస్యం?

అర్జునుడు :- దీనతాదోషమ్ము వలన-ఇట్టు తన మదుగంబె నాలో
చిక్కుకున్నది చిత్తమిప్పుడు—మిక్కుటముగా ధర్మ[illegible]లో
శరణుజొచ్చిన నీదు శిష్యుడ-శాసనం జేయుము నన్ను నీవే
తీరుగా కర్తవ్యమేదో - తెల్పి చెప్పుము అచ్యుతా.

కృష్ణుడు :- తేటపరతును మేటిపలుకుల -
సూటిగా గీతార్థసారము

ఆలకించుము అర్జునా నీ - వమల చరితార్థుడవై
జగమునందలి కర్మమెప్పుడు -
జరుగుచున్నే యుండుగావున

నీవు చేయకపోయినా అది -
నిన్ను మించి చేతివాడే చేయును

నీకు సరిపడు నీదు ధర్మము - నీవు తప్పక ఆచరించుము

కర్మఫలమును కోరకుండిన - కర్మబంధము తొలగు పార్థ
వచ్చినను మరి వచ్చకుండిన -
వచ్చుఫలమును లెక్కసేయక

కౌశలముతో పనులు చేయుటె -
కర్మయోగ రహస్యమోయ్!

రానివాటికి కుంగిపడకే - వచ్చువాటికి పెచ్చుమీరక

సుఖము దుఃఖము లంటకుండుటె -
సహజ జీవన యోగమోయ్!

చేసి తీరక తప్పదనుకొని -
లేశమాత్రము నాకు లేదు

పొందబడనిది పొందదగినది -
నాకు ఏమియు లేక గూడా

కర్మచేయుచు లోకమున -
కాదర్శముగ నే నిలుతునోయ్

కాన పార్థానీవుగూడా -
కర్మచేయగ సిద్ధపడవోయ్

ఉన్నవారిని చూచిగాని - పోవువారిని చూచిగాని
జ్ఞానులైన వారలెప్పుడు - దుఃఖపడుట జరుగదోయ్
లేనిదానికి ఉనికిలేదు - ఉన్నదానికి లేమిలేదని
తెలిసి జీవితమంతనీవు - తెలివిగా వర్తించవోయ్

బాల్యయవ్వన వార్ధకమ్ములు -
వయసుబట్టి కలుగునటులె

క్రొత్తదేహము జీవి పొందగ -
కొంపపోయిన బాధపడకోయ్

వంటినంటిన పాతవస్త్రము-వదలిక్రొత్తదియెట్లుకట్టునో
జీర్ణదేహముపీడి జీవి-నవ్యదేహము నందునోయ్

విషయ చింతనమిచ్చు సంగము -
సంగమము కామమ్మునిచ్చును

కామమే క్రోధమ్ము తెచ్చును -
క్రోధమే సమ్మోహమిచ్చును

స్మృతియు చెడు మోహమ్మువలన -
స్మృతియె దప్పిన బుద్ధిపోవును

బుద్ధినాశమె కారణముగా -
పూర్తిగా చెడిపోవు నరుడు.

సర్వభూత ద్వేషరహితుడు -
స్నేహశరుణా నిత్యతుష్టుడు

అహంకార మమత్వశూన్యుడు -
దుఃఖసుఖముల కతీతుండు

ఓర్పుగలిగిన నియమచిత్తుడు -
నేర్పుగల దృఢ నిశ్చయుండు

నాకు నర్పితమైన బుద్ధియు -
నైనవాడే నాకు ప్రియుడు

ఇతరమనుభావమ్ము లేక-విశ్వమంతలో నన్నె జూచి
కొలుచువాని యోగక్షేమము-నేను జూతునన్ని వేళ
ఎదనునాకే సమర్పించి - ఎదకునచ్చినదెల్ల చేయుము
ధర్మమో అధర్మమో అను - నిర్ణయంబును నాకు
వదులుము

మంచిచెడ్డలనుండి నిన్ను - ముక్తిపొందుగ జేతును.
లోతుగల ఈ గీత మహిమను-శ్రోతగానే వింటివి
బాగుగా చర్చించి ఇకపై-నీకు తోచిన, నాచరింపుము.

అర్జునుడు :- పోయె మోహము స్మృతియు పొందితి -
నీదుకృపచే నచ్యుతా
శంకలేకనుంటి స్థిరముగ - నీదువచనమె చేయగా.

రంగ :- చాలా బాగుందమ్మా! అభినయంలోను గాత్రం లోను పెద్దవాళ్ళనే మరపించారు.

రఘు :- కృష్ణుణ్ణిచూస్తే మంచి దర్జాగా బ్రతికినట్లు కన్పడతాడు. ఆయన అలంకారాలకయే ఖర్చుతో ఒక LDC నెల గడిపెయ్యవచ్చుననిపిస్తుంది.

తండ్రి :- అర్థమైంది నీ ఆవేదన - 'కస్తూరీతిలకం లలాట ఫలకే వక్షస్థలే కౌస్తుభం' ఈ శ్లోకం కృష్ణుణిగూర్చి భక్త్యావేశంతో లీలాశుకుడు వ్రాసుకున్నది. ఒక వేళ సుఖాలు అనుభవించినా అవన్నీ 'అనాసక్త సుఖమన్వభూత్' అని రఘువంశ రాజుల్నిగూర్చి చెప్పినట్లు అంటకుండానే అనుభవించాడు. ఉన్నప్పుడు ఉబ్బితబ్బిబ్బు పడకుండా అనుభవించడం, లేనప్పుడు దిగాలుపడకుండా

గడపడంకూడా యోగలక్షణమేగదా! కృష్ణుడలా గడిపాడు. ఆఖరికి చివరిక్షణాల్లో బోయవాని బాణం ములికి కాలికి తగిలినపుడుగూడా ఆ బోయవానిని "నీది తప్పుకాదు" అని అనుగ్రహించాడు. తనని కొట్టిన వాళ్ళనే ఆవిధంగా అనుగ్రహించగలగడంలో అటుతర్వాత వచ్చిన జీససు మొదలైన అవతార మూర్తులకు నాంది అయాడు.

రాము :- ఏం రంగా ఏమంటావ్?

రంగ :- ఇలా చెప్పగలవాళ్ళుంటే భావోద్వేగాళ్ళకెంతో ఉపయోగం. ఈ రోజున నాకు ఉపదేశం జరిగిన రోజుగా భావిస్తాను.

సరోజ :- నిజం బాబాయిగారూ! నాకూ అదే అనిపిస్తోంది. ఇవాళ నా జీవితంలో చాలా సుదినం.

తండ్రి :- నీకేమిటమ్మా! మనందరికీ సుదినం శ్రీకృష్ణ జన్మదిన సందర్భంలో ఆయన అవతారతత్త్వాన్ని అవగాహన చేసికున్నందుకు ఆ కృష్ణుణ్ణి మన హృదయాల్లో ప్రతిష్ఠించుకుని నిత్యమూ ఆరాధిద్దాం. మన జీవన రథయాత్రకు సారథిగా ఆ కృష్ణుణ్ణి ఆశ్రయిద్దాం! ప్రతి జీవిలోను వాసుదేవుని అవలోకిద్దాం! ఆ వైకుంఠవాసుని నోరారా కీర్తిద్దాం!!

దళఅందరూ!

జయ సత్య సంకల్ప జయ శ్రీనివాస।
జయ జయ నమోదివ్య వైకుంఠవాస॥
జయ శంఖ చక్రకుండల పద్మధరణా।
జయ దివ్యగంగా నదీ జనితచరణా॥
జయ భక్తమందార జయ భుజగశయనా।
జయ పద్మనాభ జయ రాజీవనయనా॥
జయ పుణ్యభక్త జన హృదయాంతరంగా।
జయ ధర్మయుత జీవ కరుణాంతరంగా
జయ ధర్మసంస్థాపనా బద్ధచరితా।
జయ దివ్యలీలా విశిష్ట గుణభరితా॥

వాసనాద్వాసు దేవస్య వాసితం తే జగత్రయం
సర్వభూత నివాసోఽసి వాసుదేవ నమోస్తు తే.